శరవేగంగా నేషనల్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు

- ఇప్పటికే హోస్కోట నుంచి బేతమంగళం వరకూ రాకపోకలు
- ఏపీలోని రెండో ఫేజ్‌లోనూ మొగిలి వరకు రోడ్డు
- ఫేజ్–3 తమిళనాడులోనూ దాదాపుగా పూర్తయిన రోడ్డు
- 2026 కల్లా రాకపోకలకు రెడీ

పలమనేరు: దేశంలోనే ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేలలో భాగంగా చెన్నై–బెంగళూరు ఆరు లేన్ల ఎక్స్‌ప్రెస్ హైవే(ఎన్ఈ–7) పనులు శరవేగంగా సాగుతున్నాయి. కర్ణాటకలో బెంగళూరు సమీపంలోని హోస్కోట నుంచి మొదలైన రోడ్డు పనులు మన రాష్ట్ర సరిహద్దులోని వీకోట సమీపంలోని బేతమంగళం వరకూ పూర్తయ్యాయి. ఈ మార్గంలో 75 కి.మీ మేర వాహనాల రాకపోకలు అనధికారికంగా సాగుతున్నాయి. ఫేజ్–2లో భాగంగా ఏపీలో మూడు దశలుండగా, వీకోట నుంచి పలమనేరు వరకు రోడ్డు పనులు 90 శాతం పూర్తి చేశారు. మరోవైపు ఫేజ్–3లో భాగంగా తమిళనాడులోనూ 70శాతం పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. మొత్తం మీద 2026 కల్లా ఈ రోడ్డు అందుబాటులోకి రానున్నట్టు స్థానిక కాంట్రాక్ట్ కంపెనీ దిలీప్ బిల్డ్ కాన్ నిర్వాహకులు తెలిపారు.

కేవలం రెండే గంటలు!

బెంగళూరు నుంచి చెన్నైకు ఇప్పటిదాకా ఎన్‌హెచ్–4 మీదుగా కోలారు, ముళబాగిల్, పలమనేరు, చిత్తూరు, రాణిపేట మీదుగా 330 కిలోమీటర్లు ప్రయాణించి చెన్నైకి వెళ్తున్నారు. ప్రయాణ సమయం దాదాపుగా ఏడు గంటలు పడుతోంది. బెంగళూరు నుంచి మరో మార్గంగా ఎన్‌హెచ్–44 మీదుగా క్రిష్ణగిరి, వేలూరు, కాట్పాడి మీదుగా 350 కి.మీ దూరాన్ని ఏడున్నర గంటలు పడుతోంది. దీంతో ప్రయాణ దూరాన్ని తగ్గించేలా నిర్మించిన ఈ మార్గంలో 262 కి.మీ కేవలం రెండు గంటల్లో హోస్కోట నుంచి శ్రీపెంరంబూదూర్‌కు చేరుకోవచ్చు.

ఇప్పటికే మొదలైన రాకపోకలు

హోస్కోట నుంచి బేతమంగళం వరకూ ఫేజ్–1లో భాగంగా 75 కిలోమీటర్ల మేర రోడ్డులో వాహనాల రాకపోకలు ఇప్పటికే అనధికారికంగా మొదలయ్యాయి. చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాల వాహనాలు అక్కడి నుంచి కేవలం అరగంటలో హోస్కోటకు చేరుకుంటున్నాయి.

ఏనుగులకు ఇబ్బంది లేకుండా భారీ టవర్లపై రోడ్డు పనులు

ఏపీలోని రెండో ఫేజ్‌లో మూడు ప్యాకేజీలున్నాయి.



ఎక్స్‌ప్రెస్ హైవేలో భాగంగా ఫేజ్–2లో రెండో ప్యాకేజీ పలమనేరు–గుడిపాల మధ్య సాగుతున్న పనులు

తొలి ప్యాకేజీలో వీ.కోట నుంచి పలమనేరు వరకు పనులు దాదాపుగా పూర్తికావచ్చాయి. కౌండిన్య అభయారణ్యంలోని మొగిలిలో ఏనుగుల సంచారం ఉండడంతో ఇక్కడ 11 కిలోమీటర్ల మేర భారీ ఎత్తులో టవర్లు నిర్మించి దానిపై రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఇక్కడి నుంచి బలిజపల్లె మీదుగా తిరుపతివైపు వెళ్లేలా రోడ్డు కనెక్టివిటీ ఇచ్చారు. ఇక ఫేజ్–3లో భాగంగా తమిళనాడులోని 4 ప్యాకేజీల్లోనూ పనులు 70శాతం పూర్తియ్యాయి. మొత్తం మీద 2026 నాటికల్లా ఈ హైవే పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుంది.



మొగిలి ఘాట్‌లో ఏనుగులకు సమస్య లేకుండా టవర్లపై వెళ్లే రోడ్డు పనులు



వీ.కోట సమీపంలోని బేతమంగళం వద్ద ఇప్పటికే బెంగళూరుకు మొదలైన రాకపోకలు

ఇదీ ఎక్స్‌ప్రెస్ హైవే స్వరూపం

- హోస్కోట నుంచి శ్రీపెరంబూదూర్‌కు ఎక్స్‌ప్రెస్‌హైవే దూరం: 262 కి.మీ
- రోడ్డు ప్రారంభమైంది: మే 2022
- రోడ్డు నిర్మాణ వ్యయం: రూ.18వేల కోట్లు
- మొత్తం మూడు ఫేజ్‌లు, పది ప్యాకేజీలు
- కర్ణాటకలో–3, ఏపీలో–3, తమిళనాడులో–4
- కర్ణాటకలో 75కిమీ, ఏపీలో 89కి.మీ, తమిళనాడులో 98కి.మీ
- స్టాపింగ్ పాయింట్లు: హోస్కోట, మాలూరు, బంగార్‌పేట, బైరెడ్డిపల్లె(జంక్షన్), పలమనేరు, గుడిపాల సీఎంసీ, రాణిపేట, కాంచీపురం, శ్రీపెరంబుదూర్.
- ప్రయాణవేగం గంటకు: 120 నుంచి 180 కిలోమీటర్లు
- మార్గంలో మొత్తం మేజర్ బ్రిడ్జిలు: 9
- మైనర్ బ్రిడ్జిలు: 144
- బెంగళూరు నుంచి చెన్నైకు ప్రయాణ సమయం : 2 గంటలే

క్లుప్తంగా

విద్యార్థులకు సూపర్ జీఎస్టీపై పోటీలు



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్

వి.కోట: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో పలు వస్తువులపై ధరలు తగ్గాయని, దీనిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని అన్ని స్కూళ్లలో సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు అవగాహన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంజీవని కిట్లు పంపిణీ



సంజీవని కిట్లు పంపిణీ చేస్తున్న సూపర్‌వైజర్ మల్లీశ్వరి

సదుం: స్థానిక వీఆర్ఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. పోషకాహార లోపం వలన కలిగే సూపర్‌వైజర్ మల్లీశ్వరి అనర్థాలను వివరించారు. ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని కోరారు. వివిధ పోషకాహారాలతో స్టాల్స్ ఏర్పాటు చేశారు. సంజీవని కిట్లను పంపిణీ చేశారు.

పోలీస్ స్టేషన్‌లో వాలిన ప్రేమ జంట



రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

రొంపిచెర్ల: ప్రేమ వివాహం చేసుకుని ఎగిరొచ్చిన ఓ ప్రేమజంట పోలీస్ స్టేషన్‌లో వాలింది. తమకు పెద్దల నుంచి రక్షణ కల్పించాలని రొంపిచెర్ల పోలీసులను కోరింది. వివరాలు.. మండలంలోని మోటుమల్లెల దాసరిగూడెంకు చెందిన రంజిత్(21), ఇందు(20) పరస్పరం ఇష్టపడ్డారు. రెండేళ్ల నుంచి వీరి మధ్య ప్రేమ నడుస్తోంది. ఈ నేపథ్యంలో తమ పెళ్లికి పెద్దలు అంగీకరించరని భావించి పాకాల వద్ద సుబ్రమణ్యస్వామి ఆలయంలో సోమవారం వివాహం చేసుకున్నారు. అనంతరం మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో వాలారు. దీంతో ఎస్‌ఐ సుబ్బారెడ్డి ఆ జంట తల్లిదండ్రులను పిలిపించారు. ఇరుపక్షాలతో మాట్లాడారు. ఆ ప్రేమ జంటను పెద్దలతో కలిపారు. దీంతో ప్రేమ జంట ముఖంలో ఆనందం వెల్లివిరిసింది. తల్లిదండ్రులతో కలసి ఇంటికి వెళ్లింది.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్టం



సమావేశంలో మాట్లాడుతున్న వాణి శ్రీదేవి

పులిచెర్ల(కల్లూరు): శిశువులు జన్మించిన వెంటనే తల్లిపాలు(ముర్రుపాలు) పట్టించాలని, దీనివలన ఆరోగ్యవంతంగా ఎదుగుతారని పులిచెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ వాణి శ్రీదేవి అన్నారు. మంగళవారం మంగళంపేట–1అంగన్‌వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు.తల్లి పాల ప్రాముఖ్యత గురించి, పౌష్టికాహారం గురించి తెలియజేశారు. ఆకుకూరలు, పండ్లతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. సూపర్‌వైజర్ విజయలక్ష్మి, కార్యదర్శులు నాగరాజ, శివశంకర్‌రెడ్డి, మహిళా పోలీసు అన్నపూర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీపీఎస్‌కు స్వచ్ఛాంధ్ర అవార్డు



కలెక్టర్‌నుంచి అవార్డు అందుకుంటున్న పీపీఎస్ నిర్వాహకులు

పలమనేరు: పలమనేరు పరిరక్షణ సమితికి స్వచ్ఛాంధ్ర అవార్డు అందుకుంది. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణపై తమ సేవలకు గుర్తింపుగా జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదు గా పురస్కారం అందుకున్నట్టు సమితి నిర్వాహకులు నరసింహులు మంగళవారం తెలిపారు.

సమస్యలు పరిష్కరించకపోతే నిరసన ఉధృతం

కుప్పం రూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రోపాధ్యాయ చిత్తూరు జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు చిట్టిబాబు ప్రభుత్వాన్ని మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఉద్యోగ సంఘాలను చర్చలకు ఆహ్వానించలేదని విమర్శించారు. సమస్యలను పరిష్కరించకపోతే నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పూజిగానిపల్లెలో అథ్లెటిక్స్ పోటీలు



పుంగనూరు: అథ్లెటిక్స్‌లో విజేతలుగా నిలిచిన వారితో ఉపాధ్యాయులు

పుంగనూరు: మండలంలోని పూజిగానిపల్లె ఉన్నత పాఠశాలలో మంగళవార మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలను హెచ్ఎం బాలసుబ్రమణ్యం ప్రారంభించారు. పూజిగానిపల్లె, గూడూరుపల్లె, చంద్రమాకులపల్లె పాఠశాలల నుంచి క్రీడాకారులు వివిధ పోటీలలో పాల్గొన్నారు. బాలుర విభాగంలో దేవేంద్ర, లక్ష్మీలోచన్, జలాల్,లతీఫ్, బాలికల విభాగంలో జ్యోత్స్న, గానవి, కన్నమ, పూజ, కళావతి చాంపియన్లుగా నిలిచారు. పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు సదుంలో జరగనున్న డివిజనల్ పోటీల్లో పాల్గొంటారని మండల కో–ఆర్డినేటర్ జయక్రిష్ణ తెలిపారు. పోటీలను ఫిజికల్ డైరెక్టర్లు ఉమ, రెడ్డిరాధ, తులసీరాం, మురళీధర్, జ్యోతి, సుమ నిర్వహించారు.

అన్నింటా రాణించండి

చౌడేపల్లె: విద్యార్థులు అన్నింటా రాణించాలని జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.దామోదరరాజు అన్నారు. మంగళవారం అమరక్రిష్టాపురం సమీపంలోని చెరువులో మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జెడ్పీటీసీ సభ్యుడు ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములను క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలన్నారు. క్రీడల్లోనూ సత్తా చాటాలని ఆకాంక్షించారు. పోటీల నిర్వహణకు తనవంతు సహకారం ఆయన అందజేశారు. అనంతరం జూనియర్, సీనియర్స్ బాలురు, బాలికల విభాగాల్లో పరుగు పందెం, త్రోస్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్ పోటీలను నిర్వహించారు. విజేతలకు జెడ్పీటీసీ సభ్యుడు, పుదిపట్ల ఉన్నత పాఠశాల హెచ్ఎం పద్మజ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయులు వెంకటేష్, రాజేంద్ర, వంశీ, భవాని,నాగమునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చౌడేపల్లె: విజేతలకు మెడల్స్ అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సభ్యుడు దామోదరరాజు, హెచ్ఎం పద్మజ

రహదారిపై నీటిని మళ్లించేందుకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

బైరెడ్డిపల్లె: మండలంలోని పెద్దపురం–పెద్దచల్లారగుంట రహదారి మార్గాన్ని ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. 'ప్రయాణం నరకం' శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనంపై ఆయన స్పందించారు. హంద్రీ–నీవా జలాలు పెద్దపురం చెరువుకు చేరుతుండడంతో నీరు రహదారిపై ప్రవహిస్తుండటం మూలాన ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండటం విదితమే. రహదారిపై నీటిని మళ్లించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ అజయ్, పంచాయతీ కార్యదర్శి గణేష్, మండల రిసోర్స్ పర్సన్ సురేష్‌బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.



రహదారిపై ప్రవహిస్తున్న నీటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

క్షేత్ర స్థాయిలో 'ఉపాధి'ని పర్యవేక్షించాలి

గుడుపల్లె: గ్రామాలలో క్షేత్ర స్థాయి నుంచి ఉపాధి పనులను పర్యవేక్షించి సామాజిక తనిఖీలు చేయాలని ఉపాధి హామీ ఏపీడీ ఏపీడీ సుబ్రమణ్యం ఆదేశించారు. మంగళవారం స్థానిక శ్రీశక్తి భవనంలో సామాజిక తనిఖీలకు వచ్చిన 11 మంది డీఆర్‌పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మండలంలో ఉపాధి హామీ పథకంలో 2024 ఏప్రిల్ నుంచి మార్చి 2025 వరకు చేసిన పనులకు సంబంధించి వివరాలను సేకరించి గ్రామ, మండల స్థాయిలో నిర్వహించే గ్రామ సభల్లో చర్చించాలన్నారు. డీఆర్‌పీలు గ్రామాలకు వెళ్లి పనులు చేసిన ప్రతి ఒక్కరి నుంచి వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు టీఎం.బాబునాయుడు, సుబ్రమణ్యం, ఏపీఓ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ బృందానికి అవగాహన కల్పిస్తున్న ఏపీడీ సుబ్రమణ్యం

వాల్మీకి మహర్షి విగ్రహం ఊరేగింపు

బైరెడ్డిపల్లె: మండలంలోని బాపలనత్తంలో వాల్మీకి మహర్షి ఉత్సవ విగ్రహాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన పల్లకిపై కొలువుదీర్చి గ్రామ వీధుల్లో ఊరేగించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు గోవిందప్ప, జెడ్పీటీసీ ఆర్.కేశవులు, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, వైస్ ఎంపీపీలు నారాయణస్వామి, రూప జయకుమార్‌రెడ్డి, సర్పంచులు వెంకటేష్, రమణారెడ్డి, దేవేంద్రరెడ్డి, రాజప్ప, వైస్ సర్పంచ్ తబ్రాజ్, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లె: వాల్మీకి జయంతి వేడుకల్లో జెడ్పీ చైర్మన్, పార్టీ నాయకులు

సదుంలో చిత్రపటం ..

సదుం: స్థానిక వాల్మీకి మహర్షి ఆలయంలో అభిషేకాలు, పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి స్వామి వారి చిత్రపటాన్ని మేళతాళాలతో ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘ సభ్యులు చిన్నరమణ, రవి, రామాంజులు, పవన్, నీలకంఠ, హరీశ్, బాలాజి, ఈశ్వర, సహదేవయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు డిగ్రీ కాలేజీలో..

పలమనేరు: వాల్మీకి మహర్షి ఇప్పటి తరానికి ఆదర్శమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నందీశ్వరయ్య అన్నారు. కళాశాలలోని తెలుగు విభాగాధిపతి ఈ.వాసు ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించి మాట్లాడారు. మనిషి జీవితంలో పరివర్తన చాలా ముఖ్యమని వాల్మీకి జీవితం నేర్పిన పాఠమన్నారు. పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని గొల్లపల్లెలో వాల్మీకి చిత్రపటాన్ని వాహనంలో ఉంచి ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సమీప గ్రామాలకు చెందిన వాల్మీకులు, కుల సంఘ నేతలు పాల్గొన్నారు.

వాల్మీకి అడుగుజాడల్లో నడుద్దాం

పెద్దపంజాణి: వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని పలువురు పిలుపునిచ్చారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం వాల్మీకి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎంపీడీఓ బాలాజి, తహసీల్దార్ హనుమంతు, పలువురు బీసీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గంగవరం: శ్రీవాల్మీకి మహర్షి జయంతి పురస్కరించుకుని మంగళవారం మండలంలోని రెంటకుంట్ల వద్ద శ్రీసీతారాములు, మహర్షి ఆలయంలో స్వామివార్లకు ఘనంగా అభిషేకాలు, పూజలు, భజనలు చేశారు. సాయంత్రం పలు గ్రామాల్లో మహర్షి విగ్రహాన్ని ఊరేగించారు. కీలపట్ల ప్రాథమిక పాఠశాలలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.



గొల్లపల్లెలో ...



కీలపట్ల ప్రాథమిక పాఠశాలలో..



వాల్మీకి మహర్షికి పూజలు చేస్తున్న భక్తులు

ప్రజా సంఘాల నేతల ఆందోళన

పుంగనూరు: సుప్రీం కోర్టు సీజేఐపై చెప్పు విసిరిన న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక అంబేద్కర్ భవన్ వద్ద ప్రజాసంఘాల నేతలు ఆందోళన చేశారు. ఆ న్యాయవాదిపై రాజద్రోహం కేసు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

వీరాంజనేయస్వామికి పూజలు



వి.కోట: పౌర్ణమి పుస్కరించుకుని పట్టణ నడిఒడ్డున ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలు గ్రామాల ప్రజలు పూజలకు తరలివచ్చారు. అలాగే వాహనదారులు తమ వాహనాలకు ఆయుధ పూజలు చేయించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పంటలపై ఏనుగుల దాడి





మిట్టమీదరాచపల్లెలో ఏనుగులు తొక్కేసిన వరిపంట, పెకలించిన కొబ్బరి చెట్లు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పలు ప్రాంతాల్లో పంటలపై ఏనుగులు దాడి నిత్యకృత్యంగా మారింది. మంగళవారం తెల్లవారు జామున దేవళంపేట మిట్ట మీద రాచపల్లె, పెనుబాల దళితవాడకు చెందిన పలువురు రైతుల పంటలను తొక్కి నాశనం చేశాయి. ముఖ్యంగా వరి పంటకు తీవ్ర నష్టం కలిగించాయి. మిట్టమీద రాచపల్లెకు చెందిన భాస్కర్, సిద్ధయ్య, నారాయణ సాగు చేసిన వరిపంటను ఏనుగులు తొక్కివేశాయి.అలా కొబ్బరి చెట్లను పెరికి వేశాయి. కోటపల్లెకు చెందిన మురళి మామిడితోటలో కొమ్మలను విరిచేశాయి. ఏనుగుల దాడి పరిపాటిగా మారడంతో రైతులు తమ పంట పొలాల వైపు వెళ్లడానికి జంకుతున్నారు. ఎక్కడ ఏ మూల నుంచి దాడి చేస్తాయోనని హడలిపోతున్నారు. అటవీ అధికారులు పంట నష్టం పరిశీలించడం తప్పితే వాటి కట్టడికి చర్యలు తీసుకోవడం లేదని రైతన్నలు వాపోతున్నారు.

'మధ్యాహ్న భోజనం' తనిఖీ

పలమనేరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఎంఈఓ లీలారాణి ఆదేశించారు. మంగళవారం స్థానిక ఇన్‌చార్జి ఎంపీడీఓ వినోదతో కలిసి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆమె తనిఖీ చేశారు. అక్కడే పిల్లలతో కలిసి భోజనం చేశారు. నాణ్యత బాగుందని కితాబిచ్చారు.



పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ, ఎంపీడీఓ

9 నుంచి గ్రామీణ బ్యాంకు సేవలకు అంతరాయం

గంగవరం: ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు గంగవరం బ్రాంచ్‌లో ఎలాంటి బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండవని ఆ బ్యాంకు మేనేజర్ కృపానంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాశ్ బ్యాంకు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులు విలీనమై ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా ఏర్పడినట్టు తెలియజేశారు. విలీనం సందర్భంగా కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ అనుసంధానంలో జరిగే సాంకేతిక ప్రకియ కారణంగా ఈ నెల 9వ తేదీ సాయంత్రం నుంచి 13వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆర్థికపరమైన బ్యాంకింగ్ సేవలు, అన్ని ఆన్‌లైన్ లావాదేవీలు, యుపిఐ, ఏటిఎం, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఏఈపిఎస్ మొదలైన సేవలు అందుబాటులో ఉండవన్నారు. ఈ అంతరాయానికి ఖాతాదారులు సహకరించాలని కోరారు.

పోషణ చాంపియన్లకు సన్మానం



పిల్లల తండ్రులను సన్మానిస్తున్న దృశ్యం

పలమనేరు: పోషణ మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు అంగన్‌వాడీ సెంటర్లలో మంగళవారం పోషణ చాంపియన్లను గుర్తించి వారిని సన్మానించారు. పిల్లల పెంపకంలో తల్లితోపాటు తండ్రి ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ సెంటర్లలోని పిల్లల్లో మంచి పోషణగల పిల్లల తండ్రులను సన్మానించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సల్మా, పలువురు అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించండి



సమావేశంలో మాట్లాడుతున్న గురుమూర్తి

పలమనేరు: పెండింగ్ బకాయిలను చెల్లించాలని స్థానిక పెన్షనర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ గురుమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం అసోసియేషన్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, 12వ పీఆర్సీ, ఐఆర్‌లను ప్రకటించి పెన్షనర్లకు ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇకనైనా జాప్యం చేయకుండా స్పందించాలని కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



చౌడేపల్లె: మండలంలోని ఏ.కొత్తకోటలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన మంగళవారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. వాల్మీకి జయంతి పురస్కరించుకుని గ్రామస్తులు ఈ కార్యక్రమాన్ని వేద పండితులతో శాస్త్రోక్తంగా నిర్వహించారు.తొలుత గణపతి పూజ, హోమ, చండీ హోమ పూజలు చేశారు. అనంతరం అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. నియోజకవర్గ వాల్మీకి సంఘ అధ్యక్షుడు, సభ్యులను సత్కరించారు. అనంతరం అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే చౌడేపల్లె, మడుకూరు, కాగతి,పెద్దకొండామర్రిలో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు.

పన్నుల సంస్కరణలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ రామక్రిష్ణమనాయుడు

గుడుపల్లె: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామక్రిష్ణమనాయుడు మాట్లాడుతూ, దేశ ఆర్థిక వ్యవస్థలో సమగ్రమైన పన్ను సంస్కరణలపై అవగాహన విద్యార్థులకు కలిగి ఉండాలన్నారు. ఒకే దేశం–ఒకే పన్ను విధానంతో తెచ్చిన మార్పులను తెలియజేశారు.